
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 15 మార్చి 2025

నేటి నుంచి ఒంటిపూట బడులు

నరసన్నపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట పాఠశాలలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. 'ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు వరకు తరగతులు నిర్వహించాలి. ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్నభోజనం పెట్టిన తరువాత విద్యార్థులను విడిచిపెట్టాలి. పదో తరగతి పరీక్షలు జరిగే కేంద్రాల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష నిర్వహించాలి. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల'ని విద్యాశాఖ కమిషనర్ వెల్లడించారు.





శ్రీకాకుళంలో మహిళలు, యువత హోలీ సందడి



ఘనంగా హోలీ వేడుకలు

మదినిండుగా రంగులమయం

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రంగుల పండుగ హోలీని జిల్లావాసులు ఆనందోత్సాహాలతో శుక్రవారం చేసుకున్నారు. మార్వాడీ యువత, మహిళలు, రంగులు ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సందడి చేశారు. శ్రీకాకుళంలోని న్యూకాలనీ, గుడివీధి, హయాతీనగరం, రెల్లివీధి తదితర ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిలాబీలు, పకోడీలు, తినుబండారాలు పంచుకున్నారు. నృత్యాలు చేస్తూ.. రంగునీళ్ల చల్లుకుంటూ సందడి చేశారు.



నరసన్నపేటలో హోలీ సంబరాలు చేసుకుంటున్న విద్యార్థినులు



హరిపురంలో..







ఆపద వేళ.. శక్తినిచ్చేలా..

- మహిళలకు రక్షణ దిశగా పోలీసుశాఖ పటిష్ఠ చర్యలు
- సులభ పద్ధతిలో ఫిర్యాదుకు కొత్త యాప్
- జిల్లాలో నాలుగు శక్తి బృందాలు సిద్ధం
- ఉమెన్ హెల్ప్‌డెస్క్, డ్రాప్‌బాక్స్‌ల ఏర్పాటు
- ఎస్పీ పర్యవేక్షణలో సమస్యలకు పరిష్కారం

శ్రీకాకుళం క్రైం, మార్చి 14(ఆంధ్రజ్యోతి):

మహిళల భద్రతకు ప్రాధాన్యమిచ్చే దిశగా పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతోంది. విద్య, ఉద్యోగం, ఉపాధి, ఇతర పను ల కోసం బయటకు వెళ్లే మహిళలు తమ ఇళ్లకు సురక్షితంగా చేరుకునేలా శక్తి యాప్ ను రూపొందించింది. ఫిర్యాదుల పద్ధతిని సులభతరం చేసి.. మహిళలకు రక్షణ కల్పిం చేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇకపై ప్రతీ మహిళా ఓ శక్తిగా మారేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో ఈ యాప్‌ను సిద్ధం చేసింది. మహిళలు ఫోన్ లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. ఎటువంటి ఆపద వచ్చినా దీని ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తే చాలు.. తక్షణమే వారు అక్కడకు చేరుకుని రక్షణ కల్పిస్తారు. జిల్లాలోని ప్రతీ ఆటో, దాని డ్రైవర్ వివరాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓ యాప్‌లో పొందుపరచనున్నారు. దీనికి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఆటోలో ముద్రిస్తారు. మహిళలు ఆటోలో ప్రయాణించే సందర్భంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే.. శక్తి యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. ఆ ఆటో ఎక్కడికి వెళ్తుంది.. ఎవరు నడుపుతున్నారనే పూర్తి సమాచారం తెలుస్తుంది. ఆ సమాచారాన్ని శక్తి యాప్ ద్వారా తల్లిదండ్రులతోపాటు పోలీసులకు పంపించవచ్చు. తద్వారా మహిళలకు పోలీసు శాఖ భద్రత కల్పించ నుంది. అలాగే వేధింపులు, ర్యాగింగ్‌లు (మిగతా 6వ పేజీలో..)



ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రాప్‌బాక్స్

మహిళల భద్రతే ధ్యేయం..



జిల్లాలో శక్తి యాప్ ద్వారా మహిళల సురక్షిత ప్రయాణానికి శ్రీకారం చుట్టనున్నాం. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. మహిళల ఫొటోలు మార్ఫింగ్ చేసి నేరాలకు పాల్పడుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు బాధిత మహిళలు భయపడుతున్నారు. దీంతో స్టేషన్లలో ఉమెన్ హెల్ప్‌డెస్క్‌లు, పాఠశాలలు, కళాశాలలో డ్రాప్‌బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నాం. వాటిద్వారా మహిళలు, యువత నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. ఈ సమస్యల పరిష్కారం దిశగా శక్తి బృందం చర్యలు తీసుకుంటుంది. మహిళల భద్రతే తొలి ప్రాధాన్యతగా పోలీసు శాఖ పని చేస్తోంది.

-ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

పాఠశాల, కళాశాలలో డ్రాప్‌బాక్స్‌లు ఏర్పాటు..

మహిళల చిత్రాలను మార్ఫింగ్ చేసి.. వారి వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టి.. బాధితులను బెదిరించి సొమ్ము చేసుకునే నేరాలు పెరిగిపోయాయి. జిల్లాలో ఇటీవల ఇటువంటి సంఘటనలు రెండు చోటుచేసుకున్నాయి. శ్రీకాకుళం నగరానికి చెందిన ఒక వైద్య విద్యార్థిని చిత్రాలను, వీడియోలను మార్ఫింగ్ చేసి.. సామాజిక మాధ్యమాల్లో పెట్టి ఇద్దరు వ్యక్తులు ఆ యువతిని వేధించారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు తొలుత ఆ యువత భయపడింది. రెండేళ్ల తర్వాత ధైర్యం చేసి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుతో హాజరుపరిచారు. వారిద్దరినీ న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది. ఇదే తరహాలో మహిళ పోలీసుస్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో విద్యార్థినుల భద్రతలో భాగంగా ప్రతీ పాఠశాల, కళాశాలలో పోలీసులు 'సంకల్పం' పేరిట 'డ్రాప్‌బాక్స్'లను ఏర్పాటు చేశారు. వీటిద్వారా బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. శక్తి బృందం, సమీప స్టేషన్ సిబ్బంది వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతారు. వాటిని నేరుగా ఎస్పీ పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.



టెక్కలి: నిర్మానుష్యంగా ఉన్న ఇందిరాగాంధీ కూడలి

భానుడు.. భగభగ

- జిల్లాలో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు

జిల్లాలో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు

కొత్తూరు	43.1
ఎల్.ఎన్.పేట	42.2
హిరమండలం	42.1
బూర్జ	41.8
పాతపట్నం	41.6
జి.సిగడాం	41.0
సరుబుజ్జిలి	41.0
సారవకోట	40.8
జలుమూరు	40.5
మెళియాపుట్టి	40.5
ఆమదాలవలస	40.3
పొందూరు	39.9
కంచిలి	39.7
టెక్కలి	39.5
ఇచ్ఛాపురం	39.2
నరసన్నపేట	39.2
కోటబొమ్మాళి	39.2
మందస	39.0
పలాస	38.8
లావేరు	38.7
నందిగాం	38.6
కవిటి	38.5
శ్రీకాకుళం	38.2
సోంపేట	37.9
ఎచ్చెర్ల	37.8
పోలాకి	37.6
రణస్థలం	36.7
గార	35.9
వజ్రపుకొత్తూరు	35.7
సంతబొమ్మాళి	35.6

శ్రీకాకుళం/ టెక్కలి/ నందిగాం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. మార్చిలోనే భానుడు భగభగమంటుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అత్యధిక తీరప్రాంతమున్న జిల్లాలో.. ఎప్పుడూ తేమ గాలి వీస్తున్నా.. పగటి వేళ భానుడి ప్రతాపాన్ని ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. నాలుగు రోజుల నుంచి వేడిగాలులు వీస్తున్నాయి. రణస్థలం, లావేరు, శ్రీకాకుళం, సరుబుజ్జిలి, పొందూరు, ఎచ్చెర్ల, ఆమదాలవలస, జి.సిగడాం, హిరమండలం, జలుమూరు, ఎల్.ఎన్.పేట, మెళియాపుట్టి, సారవకోట మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు ఆపసోపాలు పడుతున్నారు. చాలామంది ఎండ తీవ్రత కారణంగా బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో శ్రీకాకుళం నగరంలో ప్రధాన జంక్షన్లలో మధ్యాహ్నం జన సంచారంలేక నిర్మానుష్యంగా కనిపించింది. టెక్కలిలో నిత్యం జనంతో రద్దీగా ఉండే ఇందిరాగాంధీ కూడలి, అంబేద్కర్ జంక్షన్, తెంబూరు రోడ్డు జంక్షన్ ప్రాంతాల రోడ్లన్నీ వెలవెలబోయాయి. నందిగాంలో కూడా రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఇప్పుడే ఇలా ఉండగా... ఏప్రిల్, మే నెలలో ఇంకెలా ఉంటుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



నందిగాం : వెలవెలబోతున్న ప్రధాన రహదారి



దోలో మండపం వద్దకు స్వామి ఉత్సవ మూర్తులను తీసుకెళ్తున్న అర్చకులు

వైభవంగా డోలోత్సవం

- శ్రీకూర్మం.. భక్తజన సంద్రం

7లో

జీబీఎస్ కలకలం!

- జిల్లాలో మరో ఇద్దరికి వ్యాధి లక్షణాలు
- అప్రమత్తమైన వైద్యాధికారులు

రణస్థలం/హిరమండలం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గులియన్ బారీ సిండ్రోమ్(జీబీఎస్).. మళ్లీ కలకలం రేపుతోంది. ఈ వ్యాధి లక్షణాలతో సంతబొమ్మాళి మండలంలోని ఒక బాలుడు సుమారు నెల కిందట మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా జిల్లాలో మరో ఇద్దరికి ఈ వ్యాధి లక్షణాలు బయటపడడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రణస్థలం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఒక వృద్ధుడు జీబీఎస్ అనుమానిత లక్షణాలతో బాధపడుతూ శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)లో చికిత్స పొందుతున్నాడు. దీంతో శుక్రవారం డీఎంహెచ్‌వో టీవీ బాలమరళీకృష్ణ, డీపీఎంవో రవీంద్ర ఆ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జ్వరాలతో ఎవరైనా బాధపడుతున్నారా? అని పలువురిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. జీబీఎస్ అంటువ్యాధి కాదని, ప్రజలు భయపడవద్దని సూచించారు. ఈయనతో పాటు రావాడ డాక్టర్ జనార్దన్ నాయుడు ఉన్నారు.



రణస్థలం: కృష్ణాపురంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలమరళీ కృష్ణ

- అలాగే హిరమండలం మేజర్ పంచాయతీ సుభలయ కాలనీలోని ఒక మహిళ కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందింది. తరువాత కండరాలు బలహీనత, కాళ్లు తిమ్మిరెక్కడం, కంటిచూపు మందగించడం వంటి జీబీఎస్ లక్షణాలు కనిపించడంతో స్థానిక వైద్యాధికారి ఫరూక్ హుస్సేన్ (మిగతా 6వ పేజీలో..)

మనకూ ఉంది బాధ్యత

- పిల్లల ప్రవర్తనలో తల్లిదండ్రుల పాత్ర కీలకం
- విద్యార్థుల చదువులపై దృష్టి పెట్టాలి

6లో

వైద్యులు, సిబ్బంది కొరత

ఆంధ్రజ్యోతి విజిట్

- సక్రమంగా అందని సేవలు
- రోగులకు తప్పని ఇబ్బందులు
- టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో ఇదీ పరిస్థితి

టెక్కలి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని 200 పడకల జిల్లా కేంద్రాసుపత్రిని వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. శుక్రవారం ఉదయం 11గంటలకు ఈ ఆసుపత్రిని 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా.. పలు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తేలింది. రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందక ఇబ్బందులు పడుతున్న వైనం కనిపించింది. డెర్మటాలజీ విభాగానికి సంబంధించి సివిల్‌సర్జన్, ఎనస్తీషియాకు సంబంధించి డిప్యూటీ సివిల్‌సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు సంబంధించి సర్జన్, ఎనస్తీషియా పోస్టులు, అలాగే 17 మంది స్టాఫ్ నర్సులు కొరత ఉంది. సర్జికల్ గ్లౌజులు, యూరిన్ పైపులు, డ్రస్సింగ్ మెటీరియల్ కూడా అరకొరగానే ఉన్నాయి. మైక్రోబయాలజీ, హిస్టోపేతాలజీకి సంబంధించిన పరీక్షల నిర్వహణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. కట్లు వేసే గదిలో ఆర్థోపెడిక్ పరికరాలు శుద్ధిచేస్తే ఆర్థోక్లేవ్ మిషన్ పనిచేయడం లేదు. రోగులు పడుకునే మంచాలపై బెడ్‌షీట్స్ కానరావడం లేదు. మరమ్మత్తులకు గురైన వీల్‌ఛైర్లతోనే రోగులు అవస్థలు పడుతున్నారు. రోగులు కూర్చునేందుకు బెంచీలు కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కానరాని బెడ్‌షీట్లు



మరమ్మతులకు గురైన వీల్‌ఛైర్


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం


మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.




జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

చిత్రాడదారులన్నీ జనపవనమై..



జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.



మనకూ ఉంది బాధ్యత

- పిల్లల ప్రవర్తనలో తల్లిదండ్రుల పాత్ర కీలకం
- విద్యార్థుల చదువులపై దృష్టి పెట్టాలి
- ఉపాధ్యాయుల మాటకు విలువనిచ్చేలా చూడాలి
- బాల్యం నుంచే మంచి బాట పట్టించాలి..

తాము ఎంత ప్రయత్నించినా పిల్లలు సరిగా చదవడం లేదని.. వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ విజయనగరం జిల్లాలోని ఓ ఉపాధ్యాయుడు ఇటీవల గుంజీలు తీసి.. సాష్టాంగ నమస్కారం చేసి.. తనకు తానే శిక్ష విధించుకున్న సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఘటన ప్రస్తుత సమాజంలోని పరిస్థితులకు దర్పణంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో పిల్లల ప్రవర్తన విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల అంశం మరోసారి తెరపైకి వస్తోంది. చదివించే బాధ్యత ఉపాధ్యాయులదే అయినా.. వారు చదువుపై ఆసక్తి చూపడంలో కీలక పాత్ర పోషించేది తల్లిదండ్రులదేనని నిపుణులు చెబుతున్నారు.

నరసన్నపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి):

నరసన్నపేట పట్టణంలోని ఒక పాఠశాలలో పదో తరగతి చదివే కొందరు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు రోజూ హోంవర్కు ఇచ్చేవారు. హోం వర్కు చేయని విద్యార్థులకు మంచి మాటలు చెప్పినా.. తీరు మారలేదు. దీంతో తల్లిదండ్రుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. కానీ వారిలో మార్పు రాలేదు. ఇటీవల ఆ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంపై జమ్ము వైపు వెళుతుండగా... ఇద్దరు పదో తరగతి విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వెళ్లి... ఆ ఉపాధ్యాయుడిని చుట్టుముట్టి... హీరోయిజం చూపించారు.

- నరసన్నపేట మండలంలోని ఒక గ్రామంలో రెండేళ్ల క్రితం ఎనిమిదో తరగతి చదివే విద్యార్థికి 99 తరువాత వచ్చే అంకె ఏమిటని అడిగితే... ముందా.. వెనుకా? అని ఆ విద్యార్థి ప్రశ్నించాడు. తరువాత అని చెబితే.. 99 తరువాత.. 78 అని చెప్పాడు. దీనికి కారణం ప్రాథమిక దశలోనే తల్లిదండ్రులు శ్రద్ధ చూపకపోవడమేనని నిపుణులు అంటున్నారు.
- పట్టణంలోని కొన్ని పాఠశాలల్లో చదివే కొందరు విద్యార్థులైతే పాఠశాలల పేరుతో ఇంటి నుంచి బయలుదేరి... పాఠశాలకు వెళ్లక.. ఇంటికి చేరక .. రోడ్ల మీద కనిపిస్తున్నారు. ఉపాధ్యాయులు వారిని తెచ్చి క్లాసుల్లో కూర్చోబెట్టే సందర్భాలు అనేకం. అయినా ఆ విద్యా ర్థుల్లో మార్పు రావడం లేదు. ఇక ఆ పిల్లలు స్కూలుకు వెళుతున్నారో..లేదో తెలుసుకోవడానికి తల్లిదండ్రులు కనీస ప్రయత్నం చేయడం లేదు. ఇది విద్యార్థులు అదుపు తప్పడానికి దారి తీస్తోంది. ఒక్క నరసన్నపేటలోనే కాదు... జిల్లా వ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి ఉంటోంది.

పెంపకంలో పెద్దల తప్పులు..

చిన్నపిల్లల్లో క్రమశిక్షణ ఎందుకు లోపిస్తోంది? దీనికి ఎవరు బాధ్యులు? బాగా చదువుకొని... మంచి ఉద్యోగాలు చేసుకునే తల్లిదండ్రులు కూడా పిల్లల క్రమశిక్షణ విషయంలో ఎందుకు విఫలమవుతున్నారు? అనే విషయాలను లోతుగా పరిశీలిస్తే...

- క్రమశిక్షణపై సరైన అవగాహన లేకపోవడం, పిల్లల శక్తిని, వయసును తప్పుగా అంచనా వేయడం.
- తిట్టడం, కొట్టడం, అరవడం అనేవి క్రమశిక్షణ కాదు. ఇలాంటి చర్యలు పిల్లల్లో తల్లిదండ్రుల పట్ల వ్యతిరేక భావం కలిగిస్తాయి. ఏం చెయ్యాలో... ఎలా చెయ్యాలో చెప్పడమే క్రమశిక్షణ. అది కూడా పిల్లల మనసుకు హత్తుకునేలా... నెమ్మదిగా చెప్పాలి. ఇతరుల మనోభావాలను గౌరవించడం, ఎవరి మనసూ నొప్పించకుండా ప్రవర్తించడం అలవాటు చేయాలి. ఇవేవీ చేయకుండా ఫలానా పని సరిగా చెయ్యలేదని పిల్లలను నిందించడంలో అర్థం లేదని పెద్దలు గుర్తించాలి.
- పిల్లలతో ఎక్కువ సమయం తల్లిదండ్రులు గడపకపోవడం. వారితో సరిగా మాట్లాడకపోవడం వల్ల తల్లిదండ్రుల పట్ల వ్యతిరేకత ఏర్పడుతుంది. పాఠశాల నుంచి వచ్చిన తరువాత తల్లిదండ్రులు కొంత సమయం పిల్లలతో గడపాలి. ఆ తరువాత దగ్గర ఉంటూ హోంవర్కు చేయించాలి. ఇలా చేయడం ద్వారా పిల్లలకు తమ తల్లిదండ్రుల పట్ల గౌరవం పెరగడంతో పాటు చదువు పట్ల బాధ్యత పెరుగుతుంది.
- ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు హోంవర్కు చేయాలని లేదా చదవాలని చెబుతూ వారి ముంగిటే సెల్‌తో కాలక్షేపం చేస్తున్నారు. ఇలా చదివించే సమయంలో ఫోన్లు ముట్టుకోకుండా వీలైనంత వరకు ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.
- ప్రస్తుత కాలంలో చాలా మంది భార్యాభర్తల మధ్య సఖ్యత కొరవడుతోంది. ఎడమొహం..పెడమొహంగా ఉండడం... సరదాగా మాట్లాడుకోకపోవడం వంటివి పిల్లల మనసుపై ప్రభావం చూపిస్తాయి. పిల్లల్లో మమతానురాగాలు పెరగవు. కాబట్టి వారి ముందు గొడవ పడకూడదు. ఇంట్లో అందరూ కలిసి సరదాగా గడపడానికి ప్రతిరోజా కొంత సమయం కేటాయించాలి. ఇలా చేస్తే తల్లిదండ్రులు చెప్పిన ప్రతి పనినీ పిల్లలు చిటికెలో చేస్తారు. క్రమశిక్షణ పెరుగుతుంది. పెద్దలు, గురువులు చెప్పిన మాటలు వింటారని నిపుణులు చెబుతున్నారు.
- కొందరు తల్లిదండ్రులు పిల్లలను అతిగారాబం చేయడంతో పాటు, ఎక్కువ క్రమశిక్షణ, నియమాలు పాటించేలా చేస్తుంటారు. ఇవి రెండూ తప్పే. వయసుతో పాటు పిల్లల ఆలోచనల్లో మార్పులు వస్తాయి. ప్రతిదీ తల్లిదండ్రులతో పంచుకోవాలని భావిస్తారు. తల్లిదండ్రులు దీనికి సిద్ధంగా ఉంటే పిల్లలు క్రమశిక్షణతో ఉంటారు.

సెల్‌ఫోన్లకు బానిసలుగా...

- దేశవ్యాప్తంగా ఒక సంస్థ ఇటీవల చేసిన సర్వేలో మన రాష్ట్రంలో ఆరో తరగతి నుంచి విద్యార్థులు ఆండ్రాయిడ్ ఫోన్‌కు బానిసలు కావడంతో చదువులు అటకెక్కుతున్నాయని వెల్లడించింది. పట్టణాల్లో 23 శాతం, పల్లెల్లో 19 శాతం విద్యార్థులు సెల్‌ఫోన్లకు టీవీలకు బానిసలయ్యారు. ముఖ్యంగా 11 నుంచి 17 సంవత్సరాల వయస్సులో ఉన్నవారు సెల్‌ఫోన్‌లో గేమ్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటికి బానిసలుగా మారినట్లు వివిధ స్వచ్ఛంద సంస్థల సర్వేల్లో తేలింది.
- పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థుల్లో చాలా మందికి కనీసం పరిజ్ఞానం ఉండటం లేదు. చదవడం, రాయడంతో పాటు గణితం కూడికలు, తీసివేతలు, భాగహారం, గుణకారాలు రాని పరిస్థితి. దీనికి కారణం విద్యార్థులకు చదువుల్లో ఏకగ్రత లోపించడం. సెల్‌ఫోన్ ప్రభావంతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు తలకెక్కడం లేదు. ఇలాంటి వారు 5 నుంచి 8 శాతం వరకు ఉన్నారని ఇటీవల విద్యాశాఖ చేపట్టిన సర్వేలో బయటపడింది.



పర్యవేక్షణ లోపమే ప్రధాన కారణం..



పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపిస్తోంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఏం చెప్పారు? ఏం హోం వర్కు ఇచ్చారు? వంటి విషయాలను రోజూ తెలుసుకోవాలి. ఒక రోజు చేయకపోతే చేయమని చెప్పాలి. రెండో రోజూ అలాగే చేస్తే తల్లిదండ్రులు ఆ పిల్లాడిని ఉపాధ్యాయులకు దగ్గరకు తీసుకెళ్లాలి. దీంతో పిల్లలకు తమ తల్లిదండ్రులు పట్టించుకుంటున్నారనే భయం ఏర్పడి చదవడం ప్రారంభిస్తారు. ఆరో తరగతి నుంచి ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలపై వ్యక్తిగత శ్రద్ధ చూపించాలి. చదివే సమయంలో ఇంట్లో టీవీలు, సెల్‌ఫోన్లు ఎవరూ చూడకూడదు.

-సింహాభట్ల శ్రీనివాసశర్మ,
భౌతికశాస్త్ర అధ్యాపకుడు, నరసన్నపేట

మెదడుపై ప్రభావం..



సెల్‌ఫోన్, టీవీలు ఎక్కువగా చూడటం వల్ల విద్యార్థుల గుండె, మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కొన్ని యాప్‌ల వల్ల తెలియకుండానే కాలయాపన జరుగుతుంది. దీంతో చదువు పట్ల శ్రద్ధ తగ్గుతుంది. పుస్తకాలకు దూరంగా ఉంటున్నారు. విద్యార్థులు స్వీయ నియంత్రణ పాటించే విధంగా తల్లిదండ్రులు కౌన్సిలింగ్ చేయాలి.

-సీపాన శ్రీనివాసబాబు,
ఆసుపత్రి సూపరింటెండెంట్, నరసన్నపేట

విద్యార్థులలో మార్పు రావాలి..



చదువుపై ఆసక్తి పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేసినా.. విద్యార్థుల్లో మార్పు రావాలి. చదువుకోవాలనే తపన ఉండాలి. కొత్త విషయాలు నేర్చుకోవాలనే ధ్యాస విద్యార్థుల్లో కనిపించడం లేదు. వారి సందేహాల నివృత్తికి సెల్‌ఫోన్ అవసరం లేదు. నిపుణులైన ఉపాధ్యాయులను సంప్రదించాలి.

-పైడి వెంకట్రావు, హెచ్‌ఎం,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట

నీతి కథలతో పుస్తక పఠనంపై ఆసక్తి..

చిన్నతనంలో చందమామ కథలు వంటి నీతికథలు పిల్లలకు తాతయ్యలు, అమ్మమ్మలు చెప్పాలి. ప్రస్తుత రోజుల్లో ఇంట్లో ముసలివాళ్లు టీవీలకు అతుక్కుపోవడంతో.. పిల్లలు సెల్‌ఫోన్ల బాట పడుతున్నారు. నీతికథలు, పంచతంత్రం వంటి కథలు చెప్పడం ద్వారా పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. సెల్‌లో గేయాలు, పాటలు చూపడంతో వాటి పట్ల ఆసక్తి పెంచుకుంటున్నారు. పిల్లలకు ఇంట్లో తాతయ్యలు, అమ్మమ్మలు లేకపోతే నీతికథలు, మంచి మాటలు రోజూ చెబుతూ ఉండాలి.

-కింతలి సత్యనారాయణ,
రిటైర్డు అధ్యాపకులు, నరసన్నపేట

ఆపద వేళ.. 'శక్తి'నిచ్చేలా..

(ఐదో పేజీ తరువాయి)

తదితర వాటిపైనా నేరుగా ఈ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు.

ఎస్‌ఐతో సహా ఆరుగురు సిబ్బందితో బృందం ఏర్పాటు..

జిల్లాలోని నాలుగు శక్తి బృందాలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సిద్ధం చేశారు. ప్రతీ సబ్ డివిజన్‌కు ఒక శక్తి టీమ్‌ను నియమిస్తారు. ఎస్పీ ఆధ్వర్యంలో ఓ బృందం పని చేస్తుంది. ఈ బృందంలో ఒక ఎస్‌ఐ ఐదుగురు పోలీసు సిబ్బంది..(ఇందులో ఇద్దరు మహిళా పోలీసులు) ఉంటారు. వీరంతా 112, 100 ఫోన్ నెంబర్లతోపాటు పోలీసుస్టేషన్‌కు వచ్చే మహిళల ఫిర్యాదుపై న్యాయం చేసేందుకు పనిచేస్తారు.

● ప్రతీ స్టేషన్‌లో ఉమెన్ హెల్ప్‌డెస్క్..

జిల్లాలో ఉన్న 36 పోలీసుస్టేషన్లలో త్వరలో ఉమెన్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఓ మహిళా కానిస్టేబుల్ కేవలం మహిళ బాధితుల నుంచి మాత్రమే ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఆ వివరాలను ఎస్‌హెచ్‌ఓలకు వివరించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తారు. దీంతో మహిళలు అభద్రతాభావంతో చెప్పుకోలేని కొన్ని ఫిర్యాదులను మహిళా పోలీసులకు చెప్పుకునేందుకు అవకాశం కల్గుతుంది.

జీబీఎస్ కలకలం!

(ఐదో పేజీ తరువాయి)

అప్రమత్తమయ్యారు. ఈ నెల 12న ఆమెను మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి (రిమ్స్) రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె రిమ్స్‌లో చికిత్స పొందుతూ కోలుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. హిరమండలం పీహెచ్‌సీతోపాటు సుభలయ గ్రామాన్ని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్ సందర్శించారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆ మహిళ ఎక్కడ పనిచేస్తోంది.. ఇటీవల ఇతర ప్రాంతాలకు ఏమైనా వెళ్లిందా..? అని ఆరా తీశారు. గ్రామంలో ఎవరైనా కండరాల నొప్పులతో బాధపడుతున్నట్టయితే వెంటనే స్థానిక పీహెచ్‌సీని సంప్రదించాలని సూచించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఎంపీడీవో కాశీప్రసాదరావు ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు గ్రామంలో బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేయించారు. ఇదిలా ఉండగా కండరాలు బలహీనత, తిమ్మిర్లతో బాధపడుతున్న మహిళకు జీబీఎస్ వ్యాధి నిర్ధారణ కాలేదని డీఎంహెచ్‌వో బాలమురళీ కృష్ణ తెలిపారు.

ప్రజా గాయకుడు పందిరి రాము మృతి

పొందూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా గాయకుడు, పాటల పందిరి పుస్తక రచయిత, తాడివలస గ్రామానికి చెందిన పందిరి రాము (70) శుక్రవారం మృతిచెందారు. పెద్దగా చదువుకోకపోయినా ప్రజా వేదికలపై అలవోకగా ప్రజలను ఉత్తేజపరిచే పాటలను పాడి అలరించేవారు. పందిరి రాము మృతి పట్ల తాడివలస సర్పంచ్ తమ్మినేని మనెమ్మ, జానపద కళాకారులు రామచంద్రరావు, విశ్రాంత ఉద్యోగులు అన్నాజీభట్లు, ఎంఎఎన్ భట్లు, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

పైడిభీమవరం శివాలయంలో చోరీ

రణస్థలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం శివాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. మైక్‌సెట్, రూ.1500 నగదు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

రైలు ఢీకొని రిక్షా కార్మికుడి మృతి

ఇచ్ఛాపురం, మార్చి14 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో బెల్లుపడ కాలనీకి చెందిన రిక్షా కార్మికుడు ఆశి బైరిరెడ్డి మృతి చెందాడు. శుక్రవారం పూరి నుంచి తిరుపతి వైపు వెళ్లే రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడని పలాస జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచిలి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం మఠం సరియాపల్లిలో గల ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాలని తెలిపారు. ఈనెల 17 నుంచి 22లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ఆమదాలవలస, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే రవికుమార్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ ప్రజల నుంచి వినతులను ఎమ్మెల్యే స్వీకరిస్తారు.

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

ఎచ్చెర్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కుంచాల కురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం పౌర్ణమి పూజలు భక్తి శ్రద్ధలతో చేశారు. రాజరాజేశ్వరి దేవికి విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. శ్రీ చక్రాలకు మహిళలు కుంకుమ పూజలు చేశారు.

మహాలక్ష్మి అమ్మవారి జయంతి

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర దేవస్థానంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బుచ్చిపేటలో ఉన్న పాత రామమందిరాన్ని పునర్నిర్మించారు. ఈ ఆలయంలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించారు. అంతకుముందు నూతన వస్త్రాలతో స్వామిని అలంకరించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా అలంకరించారు.

డోలోత్సవం ముగింపు సందర్భంగా కాకి వీధి ముత్యాలమ్మ తల్లికి, బరాటం వారి వీధిలో ఉన్న నీలమ్మ తల్లికి భక్తులు పూజలు చేశారు.

శ్రీకూర్మంలో వైభవంగా డోలోత్సవం


కూర్మనాథుని ఆలయంలో భక్తుల రద్దీ


మత్స్యలేశంలో సముద్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

గార, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మం.. భక్తజన సంద్రమైంది. శ్రీకూర్మంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న డోలోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా స్వామి ఉత్సవ మూర్తులను డోలో మండపంలో అర్చకులు వేంచేపు చేశారు. భక్తులు అక్కడే స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు విజయనగరం పూసపాటి గజపతులు గోత్రనామాలతో ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు, అర్చకులు పూజలు చేశారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఈవో గురునాథరావు స్వామిని దర్శించుకున్నారు. అలాగే భక్తులు ఎల్.మత్స్యలేశంలో పవిత్ర సముద్ర స్నానాలు చేశారు. సీఐలు పైడపు నాయుడు, బి.ప్రసాదరావు(మెరైన్), ఎస్ఐలు ఆర్.జనార్దనరావు, టి.రామారావుతోపాటు సుమారు వందమంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

బెజ్జిపుట్టుగలో...

కవిటి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసిన చక్రధర పెరుమాళ్ల స్వామి డోలోత్సవ యాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత చక్రధర స్వామి వారికి పానకాలు నైవేద్యంగా అందించి యాత్రలో భక్తులు పాల్గొన్నారు. నూతన దంపతులు స్వామి వారికి అరటిగెలను సమర్పిస్తే సంతాన సమస్యలతో పాటు కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. శుక్రవారం వేకువ జాము నుంచి ప్రధాన అర్చకులు సత్యనారాయణ స్వామి, రాజేష్, రాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పొందల కృష్ణారావు, రాంబాబు, విజయ్‌కృష్ణలు, గ్రామస్థులు యాత్రలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. ఈ యాత్ర శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు కొనసాగింది. అనంతరం స్వామివారిని ఊరేగించిన పల్లకిని కామదహనం పేరిట దహనం చేసి డోలోత్సవాలకు ముగింపు పలుకుతారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కవిటి పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఇచ్ఛాపురంలో...

ఇచ్ఛాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్ద జగన్నాథ స్వామి దేవాలయంలో డోలోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కొలువదీరిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి డోలా మండపం వద్ద పూజలు నిర్వహించారు. ఉనిత్యారాధనల అనంతరం రథంపై బెల్లుపడ కాలనీ సమీప డోలోత్సవ ప్రాంగణ మహామండపంపై స్వామిని కొలువుతీర్చి అర్చకులు పద్మకుమార్ ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం కళాకారుల ఆధ్వర్యంలో గాత్రకచేరిని నిర్వహించారు. ఆలయ మేనేజర్ బెండి రామారావు పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు.


కవిటి:చక్రధర పెరుమాళ్ ఆలయం వద్ద భక్తుల క్యూ


ఇచ్ఛాపురం: వేణుగోపాలుని ఊరేగింపు దృశ్యం

కౌన్సెలింగ్‌తో మేలు చేసింది టీడీపీ ప్రభుత్వమే:ఎమ్మెల్యే


ఎంబ్రాయిడరీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న రవికుమార్

పొందూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా కౌన్సెలింగ్ విధానంలో పారదర్శక బదిలీలకు అవకాశం కల్పించింది సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశం ప్రభుత్వమేనని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పట్టణానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పి.కూర్మారావు, వై.గోపాలరావు, వై.రమాదేవి ఏర్పాటు చేసిన సర్వేపల్లి విగ్రహావిష్కరణలో మాట్లాడారు. విగ్రహ దాతలను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.

వ్యక్తిగత కక్షలు వద్దు

వ్యక్తిగత కక్షలకు పాల్పడవద్దని ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటరావును ఎమ్మెల్యే రవికుమార్ హెచ్చరించారు. వ్యక్తిగత కక్షతో హెచ్ఎం ఇంక్రిమెంట్లు నిలిపివేసిన వైనంపై కొంతమంది రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ... ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని పాఠశాలను అభివృద్ధి చేయాలే తప్ప వ్యక్తిగత కక్షలకు పాల్పడవద్దని మందలించారు. ఇప్పటికే 1400 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య 600కు దిగిపోయిందని.. ఇదేనా మీ సామర్థ్యం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని ఎంఈవో శ్రీరాములుకు సూచించారు.

అవకతవకలు జరిగితే చర్యలు తప్పవు

పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనులపై విచారణ జరుగుతోందని... అవకతవకలు, అక్రమాలు వాస్తవమని తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. నాడు-నేడు పనులు, పాఠశాల పరిపాలనలోను కుటుంబ సభ్యులు జోక్యం చేసుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మన్మథరావు, ఎంఈవోలు శ్రీరాములు, పి.రాజారావు, ఈవో మోహన్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు రామ్మోహన్, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీలు బి.గిరి, ఎ.వాణి, నాయకులు ఎ.విజయలక్ష్మి, అన్నెపు రాము, బి.శంకరభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కంచి కామాక్షి కల్యాణం

మండల కేంద్రంలోని కంచికామాక్షి అమ్మవారి ఆలయంలో శుక్రవారం కంచికామాక్షి, ఏకాంబరేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ స్వామిని దర్శించుకున్నారు.

పీఎంఈజీపీతో ఉపాధి

రాష్ట్రంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కింతలి గ్రామంలో ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం (పీఎంఈజీపీ)లో భాగంగా రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన 3 ఎంబ్రాయిడరీ, మగ్గం యూనిట్లను శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్‌తో కలసి రవికుమార్ ప్రారంభించారు. దీనిని ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు తోటి మహిళలకు ఉపాధి చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పైడి ప్రసాద్, ఎంపీటీసీ హనుమంతురావు, మాజీ సర్పంచ్ గణపతి పాల్గొన్నారు.

శ్రీకూర్మ క్షేత్రం అభివృద్ధికి కృషి

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు


కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో గురునాథరావు

గార, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన శ్రీకూర్మ క్షేత్రం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం రాత్రి వారు శ్రీకూర్మనాథుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు వారికి ఆశీర్వచనాలు అందజేసారు. స్వామివారి చిత్రపటాన్ని ఆలయ ఈవో గురునాథరావు, ప్రధానార్చకులు సీతారామ నరసింహాచార్యులు అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ క్షేత్రాన్ని అభివృద్ధి చేసి, విదేశీ పర్యాటకులు ఇక్కడకు వచ్చేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సత్కారం

కంచిలి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం అంపురం నుంచి ఘాటి ముకుందపురం వరకు గల 11 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ. 23కోట్లు మంజూరుకు కృషి చేసిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కంచిలి మండల టీడీపీ సీనియర్ నాయకులు బుడ్డెపు కామేష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం శాలువతో సత్కరించారు. ఈ రహదారి నిర్మాణంతో 15 పంచాయతీల ప్రజల ఇబ్బందులు తొలుగుతాయని తెలిపారు.

తోలాపి గ్రామానికి మహర్దశ

పొందూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తోలాపి గ్రామానికి మహర్దశ పట్టింది. పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే రవికుమార్ చొరవతో గ్రామంలో రోడ్లు, కాలువల నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు మొదటి విడతలో 24 పనులకు రూ.1.54 కోట్లు విడుదలయ్యాయి. ఈ పనులకు మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కూన సత్యారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. అమ్మాయమ్మ, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీలు పి.అప్పారావు, పి.అప్పలనాయుడు, పి.రాధాకృష్ణ, డి.సత్యం, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి భక్తిశ్రద్ధలతో పూజలు


స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

అరసవల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి డోలోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం 6.30 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం ఉష, ఛాయ, పద్మినీ సమేత సూర్యనారాయణ స్వామివారి ఉత్సవమూర్తులకు వర్ణ చత్రాలతో తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం చిన్నతోటలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. 11.30 గంటలకు తిరిగి ఉత్సవ మూర్తులను ఆలయంలోకి తీసుకువచ్చి విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, రంజిత్ శర్మ, శ్రీనివాసశర్మ, రామకృష్ణ, చక్రవర్తి, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, నవీన్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ నిఘాతో నేరాలకు అడ్డుకట్ట:ఎస్పీ


బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ డ్రోన్ కెమెరాకు చిక్కిన మందుబాబులు

శ్రీకాకుళం క్రైమ్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో శివారు ప్రాంతాల్లో జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలోని కిమ్స్ ఆసుపత్రి పరిసర ప్రాంతాలు, శాంతినగర్ కాలనీ, బలగ. నాగావళి నదీ పరీవాహక ప్రాంతాలు, నగర శివారు ప్రాంతాల్లో శుక్రవారం డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఈ నిఘాలో మద్యం తాగుతున్న వ్యక్తులు, పేకాటరాయుళ్లు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిక్కోలును నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు. బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్‌కు పాల్పడినా, మహిళలను వేధించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

అరసవల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ మాటే మరిచిందని విమర్శించారు. విశాఖ స్టీల్ పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు. సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, కె.కల్యాణి, డి.సుదర్శనం, హైమ, కె.అప్పారావు పాల్గొన్నారు.

20న తపాలా అదాలత్

అరసవల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న మధ్యాహ్నం 2 గంటలకు తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఫిర్యాదులను 20వ తేదీలోగా 'తపాలా అదాలత్' అనే శీర్షికతో వి.హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు, శ్రీకాకుళం పోస్టల్ డివిజన్, శ్రీకాకుళం- 532001 అనే చిరునామాకు పంపాలని ఆయన సూచించారు. అదే రోజు తన కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

జనసంద్రంగా వంశధార తీరం

● ఘనంగా వేంకటేశ్వరస్వామి చక్రతీర్థ స్నానం

హిరమండలం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ హిరమండలంలోని సుభలయి మెట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు వంశధార నదిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. మూడు రోజులపాటు నిర్వహించిన డోలోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆఖరి మట్టమైన చక్రతీర్థ స్నానాలకు వేలాది మంది భక్తులు తరలి రావడంతో వంశధార నదీ తీరం జనసంద్రంగా మారింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఊరేగింపుగా తీసుకువెళ్లి నదిలో చక్ర తీర్థస్నానం చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ ఎండీ యాసిన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


స్వామివారి చక్రతీర్థ స్నానంలో పాల్గొన్న భక్తులు


స్వామివారికి పుణ్యస్నానాలు ఆచరిస్తున్న అర్చకులు, భక్తులు

శ్రీముఖలింగేశ్వరునికి..

జలుమూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): డోలోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీముఖలింగేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వంశధార నదిలో త్రిశూల పుణ్యస్నానాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ఈవో ప్రభాకరరావు, అర్చకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


సముద్రంలో స్నానాలు చేస్తున్న భక్తులు

రట్టిలో భక్తజన హోరు

హరిపురం మార్చి 14(ఆంధ్రజ్యోతి): మందస మండలం రట్టిలో గత ఐదు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్న వల్లభనారాయణ స్వామి డోలోత్సవాల్లో చివరి రోజు శుక్రవారం భక్త జనహోరుతో.. వల్లభనారాయణ నామస్మరణతో మారుమోగింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో వాసుదేవరావు ఆధ్వర్యంలో స్వామి తిరువీధి నిర్వహించారు. స్వామివారికి ఎంతో ప్రీతికర మైన మట్టి కలశ పానకం స్వామివారికి సమర్పించారు. అధిక సంఖ్యలో సముద్ర స్నానాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మందస ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టడంతో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయి.

● ఘనంగా వల్లభనారాయణ స్వామి డోలోత్సవం


ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

ఆసుపత్రికని లిఫ్ట్ ఇచ్చి.. మరో ప్రాంతానికి..

● ద్విచక్రవాహనంపై నుంచి దూకేసిన దివ్యాంగురాలు
● గాయపడి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చేరిక

టెక్కలి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికని బయలుదేరిన ఓ దివ్యాంగురాలిని ఓ వ్యక్తి తన బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి.. వేరే ప్రాంతానికి తరలిస్తుండగా అప్రమత్తమైన ఆమె దూకేసి గాయపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. బన్నువాడ పంచాయతీ మొదుగువలస గ్రామానికి చెందిన బసవల రాణి అనే దివ్యాంగురాలు గురువారం సదరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. దారిలో బన్నువాడ గ్రామానికి చెందిన మణి అనే వ్యక్తి నేనూ ఆసుపత్రికి వెళ్తున్నానని ద్విచక్రవాహనం ఎక్కించుకున్నాడు. తీరా ఆ వ్యక్తి ఆసుపత్రికి కాకుండా సన్యాసినీలాపురం తోటల వైపు తీసుకువెళ్లా.. లోబరుచుకునేలా మాట్లాడడం ప్రారంభించాడు. దీంతో అనుమానం వచ్చి ఆమె బైక్‌పై నుంచి దూకేసింది. ఈ ఘటనలో గాయపడిన ఆమె స్పృహ కోల్పోవడంతో అక్కడే వదిలేసి ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. స్థానికులు ఆమె వద్ద ఉన్న ధ్రువపత్రాలు గుర్తించి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడం, ఈలోగా 108 వాహనంపై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు రాణి తండ్రి శేషయ్య తెలిపారు. ఈ విషయమై సీఐ విజయ్‌కుమార్ ప్రశ్నించగా.. ఈ ఘటనపై ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


చికిత్స పొందుతున్న రాణి

రోడ్డు ప్రమాదంలో చెన్నైవాసి మృతి

ఎచ్చెర్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జర్జాం జంక్షన్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం చెన్నైకు సమీపంలోని అవడి చిన్నమ్మన్ కోవెలవీధి చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న బి.ఆకాష్(35) శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు కారును డ్రైవ్ చేసుకుంటూ వెళ్తుండగా.. జర్జాం జంక్షన్ సమీపంలో ముందువెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోగా.. కొంత దూరం లాక్కొనిపోయింది. డ్రైవ్ చేస్తున్న ఆకాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఇరుక్కుపోయిన ఆకాష్‌ను పోలీసులు బయటకు తీసి శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ సమాచారాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆకాష్ (ఫైల్)

చెన్నైలో ఇచ్ఛాపురం మత్స్యకారుడు..

సోంపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు నీలాపు శ్యామసుందర్(38) చెన్నైలో మృతిచెందాడు. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నైలో చేపల వేటకోసం వెళ్లిన శ్యామసుందర్.. వేట సాగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు సముద్రంలో పడి చనిపోయాడు. సంక్రాంతికి వచ్చిన ఆయన నెల రోజుల కిందటే చెన్నై వెళ్లాడు. శ్యామసుందర్‌కు భార్య భానుమతి, కుమారుడు కుమారస్వామి ఉన్నారు.


శ్యామసుందర్ (ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడు..

జలుమూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తలతరియా పంచాయతీ ఎర్రన్నపేట గ్రామానికి చెందిన బలగ మణికంఠ(19) విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందినట్టు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో విద్యుత్ దీపాలు అలంకరణ చేస్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో మణికంఠ మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు లచ్చన్న, కుమారి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


మణికంఠ (ఫైల్)

గుర్తుతెలియని వ్యక్తి..

రణస్థలం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కోష్ట జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొని మృతి చెందాడు. జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి చెప్పిన వివరాల మేరకు.. గత కొంత కాలంగా మతిస్థిమితం లేని ఆ వ్యక్తి కోష్ట జంక్షన్‌లో తిరిగేవాడని, గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు.. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


మృతిచెందిన వ్యక్తి

పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్..

పొందూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పొందూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఉదయలక్ష్మి(53) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఏలూరులోని తన ఇంట్లో ఉండగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఐదు రోజుల కిందట కళాశాలలో ఉండగా స్పృహతప్పి పడిపోవడంతో సిబ్బంది పొందూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విశ్రాంతి తీసుకునేందుకు స్వగ్రామానికి వెళ్లారు. కాగా ఉదయలక్ష్మి అధ్యాపకురాలిగా జోన్-2లో పనిచేస్తూ ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై గతేడాది మార్చిలో ఇక్కడికి వచ్చారు. ప్రిన్సిపాల్ మృతిపై ఎమ్మెల్యే కూన రవికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, సర్పంచ్ లక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది సంతాపం తెలిపారు.


ఉదయలక్ష్మి(ఫైల్)

పురుగుల మందు తాగి యువకుడు..

నందిగాం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆనందపురం సమీప ఊరచెరువు వద్ద వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన ఇర్కాపురం హరికృష్ణ(24) అనే యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతగిరికి చెందిన హరికృష్ణ నందిగాం మండలం ఆనందపురం చెరువు గట్టుకు చేరుకుని పురుగుల మందు తాగి చనిపోతున్నానంటూ తన స్నేహితుడికి గురువారం సాయంత్రం ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఈ విషయాన్ని హరికృష్ణ బంధువులకు ఆ స్నేహితుడు తెలియజేయడంతో అక్కడకు చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న హరికృష్ణను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షేక్‌మహ్మద్ ఆలీ కేసు నమోదు చేశారు.

గోళ్లు పెంచిందని కుమార్తెను చితకబాదిన తండ్రి

టెక్కలి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ టెక్కలి పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక తన చేతికి గోళ్లు పెంచిందన్న కోపంతో తండ్రి చితకబాదిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఆ వీధివాసులు సాయంతో గాయపడిన ఆ బాలిక చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి వచ్చింది. వైద్యులు సూర్యారావు పరిశీలించి అవసరమైన మందులు అందజేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ బాలిక శనివారం చివరి పరీక్ష రాయాల్సి ఉంది. మాపట్ల కిందట తల్లి చనిపోయింది. తండ్రి మద్యం తాగి తనను కొడుతున్నాడని కన్నీరుమున్నీరుగా విలపించింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆ బాలిక తెలిపింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి

పోలాకి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వనితమండలం వద్ద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ నయీముల్లా, జిల్లా సూపరింటెండెంట్ తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు

నరసన్నపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక బాలికల వసతిగృహంలో రూ.9 లక్షల నిధులు అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, నాయకులు బైరి భాస్కరరావు, సాసుపల్లి కృష్ణబాబు, కింజరాపు రామారావు, గొలివి రామారావు, వసతిగృహ అధికారిణి పేడాడ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పనులు పునః ప్రారంభం

పాతపట్నం మార్చి 14(ఆంధ్రజ్యోతి): పెద్దసీది జడ్పీ హైస్కూల్‌లో నాడు-నేడు పనుల్లో భాగంగా చేపట్టి అసంపూర్తిగా నిలిచిన మరుగుదొడ్ల నిర్మాణాలు పునఃప్రారంభమైనాయి. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పనులను పునః ప్రారంభించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చినవంకలో ఎలుగు సంచారం

వజ్రపుకొత్తూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చినవంక పరిసరాల్లో గత రెండు రోజులుగా రాత్రి పూట ఎలుగుబంటి తిరుగుతూ గ్రామస్థులు భయాందోళనకు గురిచేస్తుంది. అర్ధరాత్రి వేళ గ్రామ సమీపంలోని పెద్దమ్మవారి గుడివద్ద సంచరిస్తుండడాన్ని ఆ పక్కనే ఉన్న ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో గుర్తించారు. గతంలో ఎలుగుబంటి చేసిన బీభత్సం ఇంకా మరువక ముందే మళ్లీ ఎలుగుబంటి సంచరిస్తుండడంతో గ్రామస్థులు హడలిపోతున్నారు. ప్రస్తుతం జీడిపిక్కల పంట సీజన్ కావడంతో రైతులు నిత్యమూ తోటల్లో ఉంటారు. ఈ సమయంలో ఎలుగుబంటి సంచారం ఆందోళన కలిగిస్తుందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.




మామిడి తోటల్లో తిష్ట వేసిన ఏనుగులు

కొత్తూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వసప వద్ద మామిడి తోటల్లో గత రెండు రోజులుగా ఏనుగుల గుంపు తిష్టవేసి వ్యవసాయ పంట, పంపుసెట్లను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో వసప, కుంటిభద్ర తదితర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వసప గ్రామానికి చెందిన వి.శివకుమార్, బత్తిలి లక్ష్మణరావులకు చెందిన వ్యవసాయ పంపు సెట్లను ధ్వంసం చేశాయి. ఏనుగుల వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఉండేలా ఫారెస్టు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.


వసప మామిడి తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

నరసన్నపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహంలో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని బీసీ సంక్షేమశాఖ అధికారి జిల్లా అనురాధ అన్నారు. గురువారం రాత్రి స్థానిక బాలికల వసతిగృహంలో నిద్రించి బస చేశారు. సాయంత్రం ఏడు గంటలు నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు విద్యార్థినులతో కలిసి పడుకున్నారు. టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీసీ బాలికల వసతిగృహ అధికారిణి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


బాలికలతోపాటు నిద్రిస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి అనురాధ

సర్వమతాల సారం ఒక్కటే

కాశీబుగ్గ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సర్వమతాల సారం ఒక్కటేనని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రంజాన్ వేళలు సందర్భంగా శుక్రవారం కాశీబుగ్గ జామియా మసీదులో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులు పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్, సూర్యనారాయణ, మసీదు అధ్యక్షులు ఎస్‌కే బాషా, సెక్రెటరీ ఎస్‌కే భషీర్, తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కష్టాల్లో ఉన్నవారికి అండగా ప్రభుత్వం

పలాస, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆమె బాధితులకు పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం ఐదుగురు బాధితులకు రూ.9.72 లక్షలు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, ఎం.నరేంద్ర, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, టంకాల రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీలు

జలుమూరు(సారవకోట), మార్చి 14(ఆంధ్రజ్యోతి): సారవకోట మండలం వడ్డినవలసలో కొలువైన శ్రీనాథస్వామి వారి కళ్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాస్థాయి బలప్రదర్శనలు నిర్వహించారు. ఈపోటీల్లో విసురుడు గుండులో ప్రథమ స్థానం గేదెల సత్యనారాయణ, ద్వితీయ స్థానంలో ఆవల గోవిందరావు, సంగిడి పోటీల్లో గేదల సత్యనారాయణ ప్రథమస్థానం, ఆవల గోవిందరావు ద్వితీయ స్థానం, బంపర్లు ఎత్తడంలో ఆవల గోవిందరావు, ప్రథమస్థానం, టంకిలకుమార్ ద్వితీయ స్థానం సాధించారు. మహిళ విభాగంలో డి.హేమశ్రీ ప్రథమస్థానం, టికెవ్వ ద్వితీయ స్థానం పొందారు. విజేతలకు ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, రెడ్డి శివనారాయణ, ఇప్పిలి వేణుగోపాలరావు, అంజనేయప్రసాద్ పాల్గొన్నారు.


రాయి ఎత్తిలో..

అటవీహక్కు చట్టాలను వినియోగించుకోవాలి

కొత్తూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజలకోసం ప్రభుత్వం తీసుకువచ్చిన అటవీ హక్కు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బి.సంజీవరావు సూచించారు. శుక్రవారం మహసింగిలో పీఆర్‌వ సభ్యులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. అడవుల సంరక్షణ, అడవులు పునర్వనం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. రిసోర్సు పర్సన్స్ దాసునాయుడు, చిరంజీవులు, నాగరాజులు పాల్గొన్నారు.

స్వామివారికి కిరీటధారణ

టెక్కలి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తవీధిలో గల గీతామందిరంలో శుక్రవారం శ్రీకృష్ణుడికి కిరీట దారణ ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలత్రిపుర కాలభైరవ పీఠాధిపతి గణేష్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గీతామందిర నిర్వాహకులు జామి వెంకటేశ్వరరావు, మాదలేటి, లాడి శ్రీనివాసరావు, గేదెల చంద్రశేఖరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలి

పాతపట్నం మార్చి 14(ఆంధ్రజ్యోతి): ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం రేట్లు పెంచాలని ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహలక్ష్మి డిమాండ్ చేశారు. పాతపట్నంలో శుక్రవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల18న విజయవాడలో జరుగనున్న రాష్ట్ర ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘ మండలకార్యదర్శి టి.సరోజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎస్.గీతావాణి, కుమారి, దుర్గమ్మ పార్వతి అమ్ముడమ్మ ముత్యాలమ్మ కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సంఘ ప్రతినిధులు

నేడు మండల సమావేశం

నందిగాం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో టి.రాజారావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరుగుతుందన్నారు. సభ్యులతో పాటు మండలానికి సంబంధించిన అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

అనపకాయలు కాదు.. బొప్పాయి



వజ్రపుకొత్తూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బాతుపురం గ్రామానికి చెందిన పార్వతీశం అనే రైతు తోటలో బొప్పాయి చెట్టుకు అనపాయ ఆకారంలో బొప్పాయి కాయలు కాసింది. అనపకాయలు వలే పొడవుగా ఉండడంతో వీటిని చూసేందుకు చుట్టు పక్కల వారు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఇవి రకమైన బొప్పాయి అంటూ స్థానికులు చెబుతున్నారు.

అవగాహన ఉండాలి

కాశీబుగ్గ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కన్సూమర్ క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్‌వీ చలం అన్నారు. శుక్రవారం కాశీబుగ్గలో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు.

కెమిస్ట్రల్లే కీలకం

కాశీబుగ్గ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించడంలో కెమిస్టులదే కీలకపాత్ర అని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటప్పారావు, సీఐ పి.సూర్యనారాయణ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎంచంద్రరావు అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో టెక్కలి డివిజన్ పరిధిలో ఉండే మండలాల వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీపురం డీఐ ఈశ, టెక్కలి డీఐ యుగంధర్, కరుణకుమార్,కెమిస్టు జంగం,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మీన సంక్రమణ పూజలు

పలాసరూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పలాస సీతారామలయ కాంప్లెక్స్‌లో వెలసిన జగన్నాధ ఆలయంలో స్థానిక ఒడియ బ్రాహ్మణసంఘ సభ్యుల ఆధ్వర్యంలో మీన సంక్రమణ పూజలు జరుపుకున్నారు. ప్రతీ నెలా లోక కల్యాణం కోరుతూ హోమం, పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పిఠాపురం సభకు జనసైనికులు

టెక్కలి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శనివారం జరుగు ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి టెక్కలి నుంచి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున జనసైనికులు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఎన్ పేట: దట్టంగా కురుస్తున్న పొగమంచు

కమ్మేసిన పొగమంచు

కొద్దిరోజులుగా పొగమంచు కమ్మేస్తుంది. ఉదయం ఏడు గంటలైనా మంచు కురుస్తుండడంతో జిల్లా వాసులు ఇబ్బందిపడుతున్నారు. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోతుంది. ఎనిమిది గంట తర్వాత నుంచి భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో ప్రజలు ఉదయం మంచు.. ఆ తర్వాత ఎండ తీవ్రతకు అవస్థలుపడుతున్నారు. జీడి, మామిడి పంటలపై పొగమంచు తీవ్ర ప్రభావం చూపిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


సరుబుజ్జిలి: దట్టమైన పొగమంచుతో రోడ్డు ఇలా..


వజ్రపుకొత్తూరు: చినవంక వద్ద తెల్లవారు జామున..